క్లుప్తంగా

మాడ్రన్ దోబీఘాట్లు నిర్మించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో మాడ్రన్ దోబీఘాట్లను నిర్మించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర నాయకుడు నడిమింటి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని హనుమాన్ మందిరంలో బుధవారం ఆ సమితి జిల్లా సమావేశాన్ని గోవింద్ బాలస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 141 మున్సిపాలిటీల్లో దోబీఘాట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అధికారులు చొరవ తీసుకొని వెంటనే దోబీఘాట్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగరాజు, ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి గున్న సురేష్, మండల కార్యదర్శి నాగుల మల్లేష్, కొత్ర దినేష్, పాలకొండ నర్సింహులు, గున్న ముత్యాలు, శాంతయ్య, గోపీలు తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా రమేష్

కొల్లాపూర్: మండల వ్యవసాయ అధికారిగా రమేష్ బుధవారం నియామకమయ్యారు. పెద్దకొత్తపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు. పెంట్లవెల్లి మండలం అదనపు బాధ్యతలు అప్పగించారు. కొల్లాపూర్ ఏఓగా సుదీర్ఘ కాలం పనిచేసిన నాగరాజు మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

నేడు వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వాహనాల వేలం పాట నిర్వహిస్తునట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. సారా తరలిస్తూ పట్టుబడ్డ ఐదు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించాలి



కొల్లాపూర్: ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ విభాగం నాయకుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం రద్దు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శీలం వెంకటేష్, మారడి చెన్నకేశవులు తదితరులున్నారు.

షటిల్ కోర్టు ప్రారంభం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని గిరిజన భవనం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును బుధవారం గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్. బీక్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం నాయకులు రాములు నాయక్, శంకర్ నాయక్, తిరుపతయ్య, నరేందర్, రమేష్, శ్రీధర్, రాజ్‌కుమార్, నారాయణ, నరేష్, రమేష్, రవి, హనుమంతు పాల్గొన్నారు.

నేడు సెల్‌టవర్..

మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలం ఇప్పలపల్లిలో భక్తుల సౌకర్యార్థం సెల్‌టవర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మద్దిమడుగుకు వచ్చే భక్తులకు ఎంతో మేలు కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కొంత కాలంగా నల్లమలలో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు సిగ్నల్స్ లేక ఎన్నో ఇబ్బందులు పడేవారని ఇక సిగ్నల్ సమస్య ఉండదని వివరించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సెల్‌టవర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. సెల్ టవర్ ఏర్పాటుతో ఉడిమిళ్ల, ఇప్పలపల్లి, మారడుగు, మద్దిమడుగు కొన్ని గ్రామాలకు సిగ్నల్ సమస్య తలెత్తదని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరిక

లింగాల: మండల కేంద్రంలోని 2వ ఎంపీటీసీ బీఆర్‌ఎస్‌కు చెందిన పీర్ల వసుమతి బుధవారం అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పీర్ల మల్లేష్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, లింగాల పట్టణ అధ్యక్షుడు వెంకటయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మన్ననూర్ గిరిజన ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అమ్రాబాద్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. సమావేశంలో మండల విద్యాధికారి బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్ననూర్: ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని హెచ్‌ఎం సిద్దార్థ మహదేవ్ అన్నారు. బుధవారం స్థానిక గిరిజన ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పీఈటీ చంద్రకళ, దేవి, ఉపాధ్యాయులు ధశరథం, రాంచందర్, తిరుపతయ్య, మోతిలాల్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలని, సమాజ సేవకు తోడ్పాటు కావాలని సూచించారు. అనంతరం పాఠశాలకు విద్యార్థులు 46 కుర్చీలను బహూకరించారు. అదేవిధంగా 1984–85 బ్యాచ్‌కు చెందిన ప్రవాస భారతీయుడు ఆర్ మధు 30 కుర్చీలను సమకూర్చగా క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షుడు వాస రాఘవేందర్ ద్వారా పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, సత్యనారాయణ రెడ్డి, శోబాన్ బాబు, అరుణ దేవి, పద్మావతి, జహీర్, సుదర్శన్, రవి కుమార్, సురేష్, శ్రీనివాస్ శర్మ, తిరుపతయ్య, లలిత, భారతి, ఫరూఖ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్: పదర మండలం రాయలగండి క్షేత్రంలో వెలిసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ఎదుట బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ(దంపతులు) పాల్గొని ధ్వజస్తంభం, మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కల్వకుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 16 కులాలకు సంబంధించిన కార్పొరేషన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలపడంపై బుధవారం కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ మాదిగ, మాల, యాదవ, కుర్మ, ఆర్యవైశ్య, రెడ్డి సంఘాల నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, బచ్చు రామకృష్ణ, రమేష్ బాబు, జగదీశ్వర్, శ్రీధర్, సంజీవ్‌యాదవ్, మబ్బుసాయన్న, సుధాకర్, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి, చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: యాదవ కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌యాదవ్, దుద్దు శ్రీనుయాదవ్, విష్ణువర్ధన్‌యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయడంపై ఆర్యవైశ్య మహాసభ నాయకులు సంబు వెంకటరమణ, జూలూరు సత్యనారాయణలు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనితీరుకు నిదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కనులపండువగా రామలింగేశ్వరుడి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

వెల్దండ: మండలంలోని గుండాలలో బుధవారం తెల్లవారుజామున అంబా రామలింగేశ్వరస్వామి చిన్న రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన చిన్న రథంపై స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. భక్తుల భజనలు, ఆటపాటల మధ్య స్వామివారి రథం ముందుకుసాగింది. ఎస్‌ఐ రవి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



తాడూరు: మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలను కనులపండువగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు బీరప్ప స్వామిని ఊరేగింపుతోపాటు అభిషేకం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని గ్రామస్తులు శంకర్, మల్లేష్‌లు తెలిపారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం



తాడూరు: మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చొరవతో రూ.60 లక్షల నిధులు మంజూరు అయ్యాయని ఎంపీటీసీ సంద రేణుక అన్నారు. మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఎంపీ నిధులతో మండల కార్యాలయ సముదాయ ఆవరణలో సీసీ పనులు చేపడుతామని పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో మొలచింతలపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో గ్రామ వార్డు సభ్యులు శారద రాజమౌళి స్పందించి స్వంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు చేయించారు.

వాహనాల వేలంతో భారీగా ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కల్వకుర్తిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా సారా, బెల్లంపానకం సరఫరా చేస్తూ కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ వాహనాలను బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో 10 వాహనాలను వేలం వేశారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ గాయత్రీ సమక్షంలో వేలం నిర్వహించారు. 7 వాహనాలను పలువురు వేలంలో వాహనాలను దక్కించుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 38 శాతం అధిక ఆదాయం వచ్చిందని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వాహనాల వేలంలో రూ.3,80,000 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందని తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన గుంటి శివలీల సోదరుడు సుధాకర్‌ల మధ్య బుధవారం పొలం విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ విషయమై శివలీల స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం ఆంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో సుధాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత: కేసులు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం లక్ష్మాపూర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు పెద్దాపూర్‌కు చెందిన తోళ్ల రమేష్, జిల్లెల రమేష్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్రగాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి గుండం అటవీ సరిహద్దు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ఆరు మంది శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కారులో వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. కారు డ్రైవర్ అజయ్‌కుమార్‌కు తీవ్రగాయాలవ్వగా, ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకొని బాధితులను అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ పరీక్షలు

కల్వకుర్తి టౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయని కల్వకుర్తి పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. చివరిరోజు పట్టణంలోని 7 పరీక్షా కేంద్రాలలో 1,588 మంది విద్యార్థులకు గాను 1,475 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన ఇంటర్మిడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిసాయి. మొత్తం 403 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 46 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటిండెంట్ బళ్ళారి శేఖర్, డిపార్ట్‌మెంట్ అధికారి దశరథం తెలిపారు.

నేటి నుంచి మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు



కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన మంత్రాలమ్మ షిడే బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 24న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ముగిస్తారు. ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరానున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్, తాగునీరు, తదితర పనుల్లో నిమగ్నం అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం

లింగాల: బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ ప్రమీల ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని కోమటికుంట గ్రామ పంచాయతీ ఆవరణలో చైల్డ్ లైన్ సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమని, బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలన్నారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైదుబాబు, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



నినాదాలు చేస్తున్న కార్మికులు

కల్వకుర్తి: మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఓ ఏఓ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు 2023 నవంబర్ నెల నుంచి గౌరవ వేతనం, అల్పాహారం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బోధన కార్మికుల సంఘం నాయకులు అనురాధ, జహీదా, నిరంజన్‌రెడ్డి, చంద్రకళ, నిర్మల, రేణుక, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జాగృతి కార్యాలయంలో భారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా కన్వీనర్ మిర్యాల పావన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గణేష్, కిశోర్, వాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



తాడూరు: మండలంలోని చర్లిటిక్యాలకు చెందిన కాజమ్మ(60) అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు



ఊర్కొండ: మండల కేంద్రంలోని జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ట్యాంకుకు సమీపంలోనే భగీరథ పైపులైన్ ఉన్నప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఊర్కొండ అభయాంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలంలో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకుకు నీరు సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల విద్యాధికారి బాసు నాయక్, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయురాలు చంద్రకళ, స్వప్న, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



కల్వకుర్తి: పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను శాలివాహన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింహా, రాజశేఖర్, సత్యం, లక్ష్మయ్య, చంద్రయ్య, శేఖర్, పర్వతాలు, సంతోష, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు



కల్వకుర్తిరూరల్: తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వెంకట్‌రాం అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులతో యాయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ దేవేందర్, 24 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



నగదు పురస్కారాలు అందజేస్తున్న ఎస్‌ఐ నరేష్

తెలకపల్లి: దాతల సహకారం అభినందనీయమని ఎస్‌ఐ నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సిగ్మా మైక్రో సిస్టం మేనేజింగ్ డైరెక్టర్ సీఎల్ఆర్ విద్యాసంస్థల సభ్యుడు చీమర్ల దామోదర్‌రెడ్డి సమకూర్చిన కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డితో కలిసి నగదు ప్రోత్సాహాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చీమర్ల దామోదర్‌రెడ్డి ఏడు సంవత్సరాలుగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాకాలను అందించడం గొప్ప విషయం అన్నారు. దాతల సహకారంతో అందిపుచ్చుకొని బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

బల్మూర్: మండల కేంద్రంలోని ఏడో వార్డులో ఉన్న బీటీ రోడ్డుపైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారని బీజేపీ జిల్లా నాయకుడు సీతారాంరెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 5లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నాణ్యత లేకుండా రోడ్డు వేస్తున్నారని ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్‌కు, పీఆర్ డీఈకి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.